క్లుప్తంగా

బీసీ బంద్‌కు బీఆర్‌ఎస్ మద్దతు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: బీసీలకు విద్య, ఉద్యోగాలతో పాటు రాజకీయ పదవుల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రిజర్వేషన్ల సాధనకోసం శనివారం తలపెట్టిన జస్టిస్ ఫర్ బంద్‌కు బీఆర్‌ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, మోబిన్, పెంచాల శ్రీధర్, ముఖీమ్, రమేశ్, లక్ష్మణ్ ఉన్నారు.

బీసీ సంఘాల పిలుపునకు సంపూర్ణ మద్దతు

ధర్మారం: స్థానిక ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయలనే డిమాండ్‌తో బీసీ సంఘాలు ఇచ్చిన పిలుపునకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ధర్మారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లా నాయక్ అన్నారు. ధర్మారంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం నేర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జేఏసీ ఆధ్వర్యంలో 18న తలపెట్టిన బంద్‌కు కాంగ్రెస్ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆయన తెలిపారు. వైస్ చైర్మన్ అరిగె లింగయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్త నర్సింహం, మాజీ వైస్ చైర్మన్ పాలకుర్తి రాజేశంగౌడ్, మాజీ సర్పంచులు కల్లెం గంగారెడ్డి, గందం మల్లయ్య, సాగంటి కొండయ్య, మాజీ ఎంపీటీసీ వేల్పుల నాగరాజు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో మెరుగైన సౌకర్యాలు

జూలపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధనతో పాటు మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని ఎంఈవో ఎ.సరస్వతి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో దాస్ సేవా సమితి, గాయత్రి గుప్తా, ఎన్జీవో సంస్థ కలిపి రూ.6లక్షలతో నిర్మించిన మూత్రశాలలను ఎంఈవో ప్రారంభించారు. అనంతరం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా స్వచ్ఛంద సేవా సంస్థ మూత్రశాలలు నిర్మించి ఇవ్వడం అభినందనీయమన్నారు. హెచ్‌ఎం లక్ష్మన్, సంస్థ ప్రతినిధి కోదాడ రవి, కల్లెపెల్లి అంజయ్య, మేరుగు కనుకయ్య ఉన్నారు.

కార్తీక పౌర్ణమి వరకు జ్యోతి ప్రదర్శన



పెద్దపల్లి: సుల్తానాబాద్ పట్టణంలోని సాంబశివాలయంలో శుక్రవారం జ్యోతి ప్రదర్శన నిర్వహించారు. పట్టణ పురవీధుల గుండా జ్యోతి ప్రదర్శన అనతికాలం నుంచి వస్తోందని పూజారి రమేశ్ తెలిపారు. నిత్య పూజలు చేయడంతో పాటు కార్తీక పౌర్ణమి వరకు శివుడికి అన్నపూజ, అభిషేకాలు, రుద్రాభిషేకం భక్తుల సహకారంతో నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

సీపీఎం నిరసన ప్రదర్శన

గోదావరిఖని: బీసీ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును నిరసిస్తూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన చౌరస్తాలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. నాయకులు వేల్పుల కుమారస్వామి, ఎ.మహేశ్వరి, మేదరి సారయ్య, భాగ్యలక్ష్మి, పి.భాస్కర్, ఎస్.కృష్ణకుమారి పాల్గొన్నారు.

బీసీ బంద్ విజయవంతం చేయాలి

గోదావరిఖని: బీసీ బంద్‌ను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమల్ల మహేశ్ కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేరుగు హన్మంత్‌గౌడ్, అసెంబ్లీ కోఆర్డినేటర్ కొండపర్తి సంజీవ్, నాయకులు జక్కుల నరహరి, మచ్చ విశ్వాస్, మిట్టపల్లి సతీశ్, ఐత పవన్‌కుమార్, మాదరబోయిన రాకేశ్, సిలివేరి అంజి, అందె రాజ్‌కుమార్, జనగామ శివరాం, ఇరుగురాల శివ, బియ్యల మహేందర్, తోకల రాజు, గాదె రాజమల్లు, చెన్నూరి రమేశ్, కాంపెల్లి రఘు పాల్గొన్నారు.

రోడ్డుపై సంచరిస్తున్న కొండశిలువ హతం

రామగుండం: పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో శుక్రవారం రాత్రి ప్రధాన రహదారిపై భారీ కొండచిలువ సంచరిస్తుండడంతో కాలనీవాసులు గుర్తించి మట్టుబెట్టారు. హౌసింగ్ బోర్డు కాలనీ ప్రధాన రహదారి పక్కనే ఐదేళ్లుగా పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలిపోయిన సింగరేణి క్వార్టర్లను తొలగించలేదు. దీంతో పిచ్చిమొక్కలు, వ్యర్థాలతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారింది. ఫలితంగా అందులో నుంచి విష సర్పాలు సంచరిస్తూ నివాస ప్రాంతాల్లోకి చేరుతున్నాయి.

పీటీఎం నిర్వహణతో సత్ఫలితాలు

- పేరెంట్స్–టీచర్స్ మీటింగ్ ఏర్పాటుతో..
  పాఠశాల సమస్యలపై పరస్పర చర్చలు

రామగుండం: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రతీనెల పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ (పీటీఎం) ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఫలితంగా ప్రభుత్వ విద్యా సంస్థలపై సదాభిప్రాయం కలిగించేందుకు ఎప్పటికప్పుడు విద్యార్థుల విద్యాస్థాయి ప్రమాణాలు, ఉపాధ్యాయుల బోధన తీరుతెన్నులు, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు, విద్యాబోధనలో నూతన పోకడలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డిజిటల్ విద్యాబోధన తదితర అంశాలను పేరెంట్స్‌కు తెలియజేస్తున్నారు.

పీటీఎం నిర్వహణతో కలిగే ప్రయోజనాలను పరిశీలిస్తే..

విద్యార్థి పురోగతిపై చర్చ: పీటీఎంతో ఉపాధ్యాయులు, విద్యార్థులపై సంపూర్ణ విషయాలపై వివరించడం. తద్వారా విద్యార్థి విద్యాస్థాయిలో పురోగతి అంశాలపై పేరెంట్స్‌కు స్పష్టత వస్తుంది.



మోడల్ స్కూల్‌లో పేరెంట్స్, టీచర్ మీటింగ్ (ఫైల్)



హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు (ఫైల్)

సమస్యల పరిష్కారం: విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల్లో విద్యాపరమైన, వ్యక్తిగత సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ఉపాధ్యాయులు, పేరెంట్స్ పరస్పరం కలిసి పరిష్కరించుకునే వీలుంటుంది.

తల్లిదండ్రుల సహకారం: పీటీఎంలతో పాఠశాల అభివృద్ధితో పాటు నూతన విద్యా విధానాలతో కూడిన బోధన అమలు చేయడం తదితర అంశాలపై సమగ్రంగా చర్చ జరుగుతుంది. దీంతో విద్యార్థుల ప్రమాణ స్థాయిపై అవగాహన వస్తుంది.

సంబంధాల మెరుగుదల: పీటీఎంలతో పేరెంట్స్‌తో ఉపాధ్యాయులకు సత్సంబంధాలు నెలకొంటాయి. తద్వారా విద్యార్థి భవిష్యత్ కార్యాచరణతో పాటు వెనుకబడిన విద్యార్థులపై చర్చించుకునే అవకాశం కలుగుతుంది.

అభిప్రాయాలు స్వయంగా వెల్లడించవచ్చు

పీటీఎంలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ స్వీయ అభిప్రాయాలను స్వయంగా వెల్లడించుకునే అవకాశం ఉంటుంది. తద్వారా బోధన తీరుతెన్నుల లో మార్పులు, విద్యార్థుల ప్రమాణస్థాయి తదితర అంశాలపై మెరుగైన చర్యలను చేపట్టే అవకాశం ఉంటుంది.

పరస్పర సందేహాల నివృత్తి



పేరెంట్స్–టీచర్స్ మీటింగ్‌తో ఇరువురి ప్రమాణస్థాయిలపై స్పష్టత వస్తుంది. విద్యార్థి చదువులో వెనకబడితే ఉపాధ్యాయులను నిందించే అవకాశం ఉండదు. విద్యార్థులపై, విద్యాబోధన తీరుతెన్నులపై పేరెంట్స్‌కు స్పష్టంగా వివరించే అవకాశం కలుగుతుంది. తద్వారా పేరెంట్స్ అభిప్రాయం మేరకు తమ పిల్లలపై నిర్ణయాలు తీసుకునే వీలుంటుంది.

– పంబాల సదానందంయాదవ్, ఆదర్శ విద్యాలయం

విద్యార్థులకు సంస్కారం నేర్పాలి



విద్యార్థులకు చదువుతోపాటు సంస్కారం, ప్రవర్తన నేర్పడమే కాకుండా పాశ్చాత్య సంస్కృతికి దూరం చేసేలా వారిని అన్ని విషయాల్లో తీర్చిదిద్దాల్సిన బాధ్యత టీచర్లపై ఉంది. ఇందుకు పేరెంట్స్ మాకు సహకరించాలి. విద్యార్థులను దండిస్తే పేరెంట్స్ వచ్చి టీచర్లను బద్నాం చేసే విధానం ఉండొద్దు. పీటీఎంతో పరస్పర సంబంధాలు మెరుగుపడి పాఠశాలకు గుర్తింపు వస్తుంది.

– అజ్మీరా శారద, హైస్కూల్ హెచ్‌ఎం, కాంప్లెక్స్ హెచ్‌ఎం

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

కాల్వశ్రీరాంపూర్: కాంగ్రెస్ సర్కార్ మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండలంలోని పెగడపల్లిలో పెద్దమ్మ ఆలయ నిర్మాణ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం పందిల్లలో ఆర్‌డబ్ల్యూఎస్ అంతర్గత ఇంజనీరింగ్ శాఖ సీఏఎఫ్ ద్వారా రూ.10లక్షల నిధులతో మిషన్ భగీరథ తాగునీటి సరఫరా పైపులైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన శిలాఫలకం వేశారు. మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ సబ్బని రాజమల్లు, మాజీ సర్పంచ్ అటికంచ శంకర్, ఆరెల్లి సుజాత, మాజీ ఎంపీటీసీలు రావి సదానందం, సుముకం మల్లారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య పాల్గొన్నారు.



పందిల్లలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

విద్యార్థులు సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి

కాల్వశ్రీరాంపూర్: విద్యార్థులు సీపీఆర్ విధానంపై అవగాహన కలిగి ఉండాలని కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వాసుపత్రి డాక్టర్ సిరిచందన అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు సీపీఆర్ విధానంపై అవగాహన కల్పించారు. ఏదైనా మానసిక ఒత్తిడికి గురైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడొద్దని, సమస్య పరిష్కారానికి 1441 నంబర్‌కు ఫోన్ చేస్తే సమస్యకు పరిష్కారం చూపి మానసిక స్థైర్యం కల్పిస్తారని పేర్కొన్నారు. ఎంఈవో మహేశ్‌కుమార్, హెచ్‌ఎం సునీత, పీహెచ్ఎస్ భాగ్యలక్ష్మి, హెచ్ఈవో శ్రీనివాస్, ఏఎస్ఎం సరోజన, ఉపాధ్యాయులు, ఆశాలు పాల్గొన్నారు.

ఓదెల మోడల్ స్కూల్‌లో..

ఓదెల: ఓదెల మోడల్ స్కూలు విద్యార్థులకు శుక్రవారం సీపీఆర్‌పై 108 సిబ్బంది అవగాహన కల్పించారు. సీపీఆర్ ఏవిధంగా చేయాలి, ఎప్పుడు చేయాలి, ఎందుకు చేయాలి అని విద్యార్థులకు వివరించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, 108 సిబ్బంది, ఈఎంటీ మహేందర్, పైలట్ రాజేందర్ పాల్గొన్నారు.



కాల్వశ్రీరాంపూర్: అవగాహన కల్పిస్తున్న డాక్టర్

బసంత్‌నగర్‌లో..

పాలకుర్తి: మండలంలోని బసంత్‌నగర్‌లోని ఇండియా మిషన్ సెకండరీ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులకు సీపీఆర్‌పై బసంత్‌నగర్ 108 సిబ్బంది అవగాహన కల్పించారు. ఈఎంటీ కుమారస్వామి, పైలెట్ సంపత్, పాఠశాల కరస్పాండెంట్ మహేంద్రన్, ప్రేమానందం, టీచర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• వృద్ధులకు పండ్లు పంపిణీ

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 21వ డివిజన్ వీర్లపల్లిలో ఈశ్వరకృప వృద్ధాశ్రమాన్ని రీజినల్ కమిషనర్ కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ అధికారి హరి పశౌరి శుక్రవారం సందర్శించారు. ఆశ్రమంలోని వృద్ధులకు దీపావళి పండుగను పురస్కరించుకొని పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. రీజినల్ కమిషనర్ గోవర్ధన్, ఎల్.మాధవరెడ్డి, సీతారాంరెడ్డి, ఆశ్రమ సహాయకులు పాల్గొన్నారు.

• దీపం బెడ్‌పై పడి కాలిపోయిన సామగ్రి

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్ అల్లూరులోని మెట్టు శాంత ఇంట్లో దీపం బెడ్‌పై పడిపోయి ఇంట్లో ఉన్న సామగ్రి కాలిపోయింది. బాధితురాలి వివరాల ప్రకారం శాంత శుక్రవారం ఉదయం దేవుని పటం ముందు దీపం వెలిగించి కూలీ పనికి వెళ్లింది. కొంత సేపటి తర్వాత ఇంట్లో నుంచి పొగలు రావడం చూసిన చుట్టుపక్కల వారు వెంటనే శాంతకు సమాచారం అందించారు. తలుపులు తీసి స్థానికుల సాయంతో మంటలు ఆర్పింది. ఇంట్లో ఉన్న వస్తువులు, గ్యాస్ సిలిండర్‌ను బయటకు తీయడంతో ప్రమాదం తప్పింది. దీపం మంచంపై పడిపోవడంతో మంచంపై ఉన్న దుస్తులు, పెట్టెలో ఉన్న కాగితాలు బ్యాంకు బుక్, రేషన్ కార్డు తదితర వస్తువులతో పాటు ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు కాలిపోయాయి. స్థానిక మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి విషయం తెలుసుకొని వెంటనే ఇంటి వద్దకు వచ్చి పరిశీలించారు. రామగుండం మండల తహసీల్దార్‌కు సమాచారం ఇవ్వడంతో రెవెన్యూ అధికారులు ఆర్ఐ సంపత్‌కుమార్, జీపీ రవీందర్ ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి పంచనామా చేసి వివరాలు నమోదు చేసుకున్నారు. దాదాపు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు నష్టం జరిగినట్లు వారు తెలిపారు.

• అందుగులపల్లి స్టేజీ వద్ద బస్సులు ఆపండి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని దేవునిపల్లిలో గల శ్రీలక్ష్మినరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం పెద్దపల్లి–బసంత్‌నగర్ మధ్య గల అందుగులపల్లి గ్రామ స్టేజీ వద్ద ఎక్స్‌ప్రెస్ ఇతర బస్సులు ఆపాలని గ్రామ మాజీ ఉపసర్పంచ్ తలారి స్వప్న, నాయకుడు సాగర్ కోరారు. గోదావరిఖని డిపో మేనేజర్‌కు శుక్రవారం వారు వినతిపత్రం అందించారు. ఏటా కార్తీక మాసంలో జరిగే జాతర బ్రహ్మోత్సవాలకు రైలు, బస్సుల్లో దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు అందుగులపల్లి వద్ద దిగేందుకు వీలుగా హాల్టింగ్ కల్పించాలని విన్నవించారు.

• యువజన రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా మహిపాల్‌రెడ్డి

ధర్మారం: మండలంలోని బంజేరుపల్లి యువజన రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కల్లెం మహిపాల్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక రెడ్డి భవనంలో శుక్రవారం సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కల్లెం రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సింగిరెడ్డి శ్రీరాంరెడ్డి, కోశాధికారిగా బద్దం రవితేజరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా కల్లెం రమేశ్‌రెడ్డి, గడ్డం రాజశేఖర్ రెడ్డి, సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

• పీఆర్‌పీ చెల్లించేంత వరకు ప్లేడే, పీహెచ్‌డీ బంద్

గోదావరిఖని: పెర్ఫార్మెన్స్ రిలేటెడ్ పేమెంట్ (పీఆర్‌పీ) చెల్లించేంతవరకు ప్లేడే, పీహెచ్‌డీ నిలిపివేస్తామని అధికారుల సంఘం నాయకులు తెలిపారు. శుక్రవారం ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 ప్రాజెక్టు అధికారి ఉదయ్‌హరిజన్‌కు వినతిపత్రం అందజేశారు.

• బంద్‌కు బీజేపీ సంపూర్ణ మద్దతు

పెద్దపల్లి: బీసీల బంద్‌కు బీజేపీ సంపూర్ణ మద్దతు ఉంటుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సౌదరి మహేందర్‌యాదవ్ అన్నారు. సుల్తానాబాద్ మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుల్తానాబాద్ మండల ప్రధాన కార్యదర్శి కొల్లూరి సంతోష్‌కుమార్, జిల్లా నాయకులు చిట్టవేని సదయ్య యాదవ్, శేఖర్ మాస్టర్, లక్ష్మణ్, కారెంగుల మహేందర్ పాల్గొన్నారు.

• అల్లుఅర్జున్ అభిమాన సంఘం జనరల్ సెక్రటరీగా రాకేశ్

గోదావరిఖనిటౌన్: సినీనటుడు అల్లు అర్జున్ అభిమాన సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీగా కేసారపు రాకేశ్ నియామకమయ్యారు.

• ప్రయోజనకరంగా పీఎం వికసిత్ రోజ్‌గార్ యోజన

జ్యోతినగర్: పీఎం వికసిత్ రోజ్‌గార్ యోజన ఎంతో ప్రయోజనకరంగా ఉందని పీఎం ప్రావిడెంట్ ఫండ్ కమిటీ అసిస్టెంట్ కమిషనర్ బ్రిజేష్ కుమార్ వ్యాస్ అన్నారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం టీటీఎస్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వరంగ కంపెనీలో ప్రయోజనాల కోసం ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించారు.

బంద్‌కు సహకరించాలి

పెద్దపల్లి: సబ్బండ వర్గాలు బంద్‌కు సహకరించాలని పలు పార్టీల నాయకులు, బీసీ సంఘాల నాయకులు వ్యాపార వర్గాలను కోరారు. సుల్తానాబాద్ పట్టణంలోని పలు దుకాణ యజమానులకు శుక్రవారం రాత్రి కలిసి విన్నవించారు. 18న నిర్వహించే బంద్‌కు పార్టీలకతీతంగా పాల్గొనాలని కోరారు. బీజేపీ జిల్లా కోకన్వీనర్ మిట్టపల్లి ప్రవీణ్‌కుమార్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ బిల్లును ఆమోదించకపోవడం సరికాదు

రామగుండం: బీసీ రిజర్వేషన్ల బిల్లును రాష్ట్ర గవర్నర్, భారత రాష్ట్రపతి ఆమోదించకపోవడాన్ని నిరసిస్తూ, జీవో నంబర్ 9 ఆర్డినెన్సుపై రాష్ట్ర హైకోర్టు స్టే విధించడాన్ని వ్యతిరేకిస్తూ బీసీ సంఘాలు తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రతినిధులు పేర్కొన్నారు. అంతర్గాంలో మాస్‌లైన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. బీసీ సంఘాలు తలపెట్టిన రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేసేందుకు మాస్‌లైన్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు.

బీసీలకు అన్యాయం

పెద్దపల్లిరూరల్: బీసీలకు మేలు చేస్తున్నట్లు చెప్పి నమ్మించిన కాంగ్రెస్ పాలకులు తీరని అన్యాయం చేశారని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు గుండవేణ స్వామి విమర్శించారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీకి కట్టుబడి ఉండాలన్నారు. బీసీ రిజర్వేషన్ల సాధనకోసం శనివారం తలపెట్టిన బంద్‌కు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. నాయకులు ఉదయ్, గంగారాం, జాషువా, రాజేందర్, రాజయ్య, రాజశేఖర్ ఉన్నారు.

కులసంఘాలు మద్దతు తెలపాలి

ఫెర్టిలైజర్‌సిటీ: బంద్ విజయవంతం చేయాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్య పిలుపునిచ్చారు. బంద్ సందర్భంగా వ్యాపారవేత్తలు, వాణిజ్య సముదాయాలు, కుల సంఘాలు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు.

బీఆర్‌ఎస్ ప్రతీ కార్యకర్త బంద్‌లో పాల్గొనాలి

ముత్తారం: బీసీ రిజర్వేషన్లకు నిరసనగా శనివారం నిర్వహించనున్న బంద్‌ను విజయవంతం చేయలని ముత్తారం మాజీ ఎంపీపీ జక్కుల ముత్తయ్య పటేల్ కోరారు. ముత్తారంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాలను ఎండగట్టడానికి చేపట్టనున్న ఈ బంద్‌లో బీఆర్‌ఎస్ నుంచి ప్రతీ కార్యకర్త పాల్గొనాలని పిలుపునిచ్చారు.

వ్యాపారస్తులు సహకరించాలి

రామగిరి: సెంటినరీకాలనీతోపాటు అన్ని గ్రామాల్లో శనివారం జరిగే బంద్‌కు సహకరించాలని బీసీ యువజన సంఘాల నాయకులు, బీఆర్‌ఎస్ యువజన నాయకులు కోరారు. శుక్రవారం సాయంత్రం సెంటినరీకాలనీలోని ప్రతీ దుకాణానికి వెళ్లి బంద్ గురించి వ్యాపారస్తులకు తెలియజేశారు. బీసీ బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ మండల నాయకులు పిలుపునిచ్చారు. బంద్‌కు డివిజన్ దళిత నాయకులు ఊట్ల శ్రీను, గద్దల శంకర్ సంపూర్ణ మద్దతు తెలిపారు.

జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

కమాన్‌పూర్: జిల్లాస్థాయిలో నిర్వహించే అండర్ 14, 17 ఫుట్‌బాల్ పోటీలకు జంగిలి మణిమోక్షిత ఎంపికైంది. యైటింక్లయిన్‌కాలనీ సింగరేణి క్రీడా మైదానంలో శుక్రవారం ఫుట్‌బాల్ టోర్నమెంట్, సెలక్షన్స్ నిర్వహించగా మణిమోక్షిత జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీలకు గోల్ కీపర్‌గా ఎంపికైంది. మోక్షిత రామగుండం ఆర్ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్‌లో గల శ్రీచైతన్య పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. తండ్రి రమేశ్ కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఎస్సై కొట్టే ప్రసాద్, ఏఎస్సైలు ఖలీల్, రహీం ఆమెను అభినందించారు.



ఎంపికైన మణిమోక్షిత



కమాన్‌పూర్: మండలంలోని గుండారం రిజర్వాయర్ మత్తడి కింద ఏర్పాటు చేసిన శ్మశాన వాటిక చుట్టూ చెట్లపొదలు పెరిగాయి. దీంతో అంత్యక్రియలు చేయడానికి గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో సేకరించిన చెత్తను శ్మశాన వాటిక వద్ద పడేస్తుండంతో దంప్‌యార్డులా మారి దుర్వాసన వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో లేదా ఉపాధి పనులు చేపట్టి శ్మశాన వాటిక వద్ద పెరిగిన చెట్లపొదలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

మెడికల్ బోర్డు కార్మికులను నిరాశకు గురిచేస్తోంది

గోదావరిఖని: కొన్ని నెలలుగా మెడికల్ బోర్డు లేకపోవడంతో కార్మికులు నిరాశకు గురవుతున్నారని ఐఎన్‌టీయూసీ నాయకులు నర్సింహారెడ్డి, ధర్మపురి అన్నారు. ఓసీపీ–1 బేస్ వర్క్‌షాప్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. స్ట్రక్చర్ మీటింగ్‌లో పాల్గొని ఒక ఒప్పందం కూడా చేయని సంఘంగా ఏఐటీయూసీ నిలుస్తోందన్నారు. సమావేశంలో నాయకులు రవీందర్‌రెడి, తిరుపతియాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

పాఠశాలల్లో ముందస్తు దీపావళి వేడుకలు



పెద్దపల్లి: సుల్తానాబాద్ అల్ఫోర్స్‌లో వేడుకలు



పెద్దపల్లిరూరల్: ట్రినిటిలో..

పెద్దపల్లి: చీకటిని నిర్మూలించి వెలుగులను నింపే పండుగ దీపావళి అని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్‌లోని అల్ఫోర్స్ పాఠశాలలో శుక్రవారం ముందస్తు దీపావళి వేడుకలు వైభవంగా నిర్వహించారు.

ట్రినిటిలో..

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ట్రినిటి ఉన్నత పాఠశాలలో శుక్రవారం ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మమతారెడ్డి చిన్నారులతో కలిసి బాణసంచా కాల్చి సంబరాల్లో పాల్గొన్నారు.

యూనివర్సల్ పాఠశాలలో..



పాలకుర్తి: యూనివర్సల్ పాఠశాలలో..

పాలకుర్తి: మండలంలోని జీడీనగర్ గ్రామ యూనివర్సల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. కరస్పాండెంట్ ఇస్మాయిల్, హెచ్‌ఎం.అఫ్జల్ ఉన్నారు.

జనరల్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాలి

రామగిరి: ఆర్జీ–3లోని సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్ పోస్టులను ఏపీఏ కార్మికులతో భర్తీ చేయాలని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ వై.వి.రావు కోరారు. శుక్రవారం అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు గని వద్ద కార్మికులతో కలిసి ధర్నా చేపట్టారు. సింగరేణిలో అన్ని ఏరియాల వారితో కాకుండా ఏపీఏ కార్మికులతో భర్తీ చేయాలని, లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. అనంతరం మేనేజర్ పెంచలయ్యకు వినతిపత్రం అందజేశారు. పిట్ సెక్రటరీ గంగాధర్, వైస్ ప్రెసిడెంట్ క్రాంతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వర, భక్తాంజనేయ ఆలయ పునరుద్ధరణ మహోత్సవం

గోదావరిఖనిటౌన్: స్థానిక ఐబీకాలనీలోని శ్రీవిఘ్నేశ్వర, భక్తాంజనేయస్వామి ఆలయ పునరుద్ధరణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ పునరుద్ధరణ కార్యక్రమాన్ని అంబటి సంతోష్‌రావు, అర్చన దంపతులు సొంత ఖర్చులతో నిర్వహిస్తున్నారు. మూడురోజుల ఉత్సవాల్లో భాగంగా 16న పల్లకి సేవ, 17న గోపూజ, 18న సుందరకాండ పారాయణం, మహా పూర్ణాహుతి నిర్వహించి అన్నప్రసాద వితరణ కార్యక్రమంతో ముగియనుంది. కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్, మాజీ కార్పొరేటర్లు సోమారపు లావణ్య అరుణ్‌కుమార్, కౌశిక లత హరి, పీచర శ్రీనివాస్, ఇన్‌కంటాక్స్ ఆడిటర్ హొల్లాల సునీత–సురేశ్ దంపతులు, ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరశర్మ, శ్రీరాంబట్ల శివ శర్మ, డాక్టర్ జగన్మోహన్‌రావు, గంట రవి, భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలో డీసీపీ, అంబటి దంపతులు

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలి

కాల్వశ్రీరాంపూర్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్ డిమాండ్ చేశాడు. శుక్రవారం తహసీల్దార్ జగదీశ్వర్‌రావుకు వినతిపత్రం అందించాడు.

రామగిరి: ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మంథని చందు మాదిగ ఆధ్వర్యంలో తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ సుమన్‌కు వినతిపత్రం అందజేశారు.

ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో..

ఓదెల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు.

యూత్ కాంగ్రెస్ బలోపేతం కోసం కలిసి నడుద్దాం

మంథని: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు సూచనలతో యూత్ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేద్దామని నాయకులు పిలుపునిచ్చారు. మంథని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం యూత్ కాంగ్రెస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి బండా కిషోర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కమల్ మాట్లాడారు. గ్రామ కమిటీలను రద్దు చేశామని, మండల, పట్టణ యూత్ కాంగ్రెస్ నూతన కమిటీలు నియమించనున్నట్లు పేర్కొన్నారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్, రాజు, మండల మాజీ అధ్యక్షుడు ప్రవీణ్ ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెద్దపల్లి జిల్లా : 9951602934
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
పెద్దపల్లి : కె.తిరుపతి, ACO - 7997958206
పెద్దపల్లి : ఎం.మహేందర్, SR - 9573331940
మంథని : రాజేశ్ - 9676603963
రామగుండం : కె.శ్రీనివాస్ - 9704047464
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899